క్లుప్తంగా

వాహనాల తనిఖీ



వీరులపాడు: వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా నడుచుకుంటే చర్యలు తప్పవని ఎస్‌ఐ మహాలక్ష్మణుడు హెచ్చరించారు. మండలంలోని జమ్మవరం గ్రామ సమీపంలో శనివారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆటోడ్రైవర్లకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే వాహనాన్ని సీజ్ చేయడంతోపాటు కఠినచర్యలు తీసుకుంటామన్నారు. అంతేకాకుండా ఆటోల్లో లౌడ్ స్పీకర్‌లు వినియోగిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ముఖ్యంగా వాహనాలకు సంబంధించిన పత్రాలను విధిగా వెంట ఉంచుకోవాలన్నారు. రోడ్డు నిబంధనలకు అనుగుణంగా వాహనాలను నడిపి ప్రమాదాల నియంత్రణకు సహకరించాలని సూచించారు. అనంతరం రికార్డులు సరిగాలేని పలు వాహనాలను గుర్తించి జరిమానా విధించారు.

నిత్యాన్నదానానికి విరాళాలు



తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి శనివారం భక్తులు విరాళాలు అందజేసినట్లు ఈవో సాంబశివరావు తెలిపారు. సూర్యాపేట జిల్లా రాంపురం గ్రామానికి చెందిన గున్నా పుల్లయ్య దంపతులు రూ.25 వేలు, కొత్తగూడేనికి చెందిన వాసిరెడ్డి శ్రీలక్ష్మి దంపతులు రూ. 10,116లను విరాళంగా అందజేసినట్లు ఈవో వివరించారు. ఆలయ అర్చకులు రామకృష్ణమాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్బన్ మీసేవ కేంద్రాలు పునఃప్రారంభించాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): గతంలో మూసి వేసిన 170 ప్రభుత్వ అర్బన్ మీ సేవ కేంద్రాలను పునఃప్రారంభించాలని ఏపీ ఈ(మీ) సేవ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థను ప్రారంభించి జీవో ఎంఎస్ నంబర్ 2 ద్వారా ఈసేవ వ్యవస్థను గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థకు బదిలీ చేశారని గుర్తు చేశారు. దీంతో గత 19 ఏళ్లుగా ఉద్యోగంపై ఆధారపడి జీవిస్తున్న 607 మంది ఉద్యోగులు రోడ్డున పడ్డారన్నారు. యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేష్‌ను కలిసి తమ సమస్యలపై వినతి పత్రం ఇచ్చామని, తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఇచ్చిన హామీ మేరకు 170 ప్రభుత్వ అర్బన్ మీసేవ కేంద్రాలు తిరిగి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సీఐటీయూ నగర కార్యదర్శి ఎం.వి.సుధాకర్, ఎం.బాబూరావు, నాగేశ్వరరావు, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చేతివృత్తులను వ్యాపారంగా మార్చుకోవాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన స్కీమ్‌ను సద్వినియోగం చేసుకుని చేతివృత్తులను వ్యాపారంగా మార్చుకుని ఆర్థికంగా స్థిరపడాలని ఎంఎస్ఎంఈ ఛాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవాధ్యక్షుడు దాసరి దేవరాజ్, ఛాంబర్ డెవలప్‌మెంట్ అధికారి ప్రభ సూచించారు. స్థానిక బీఆర్‌టీఎస్ రోడ్డు సమీపంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యాలయంలో శనివారం ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన స్కీమ్‌పై వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా వడ్రంగి, పడవల తయారీ, కమ్మరి, స్వర్ణకారులు, కుమ్మరి, శిల్పకారులు, చర్మకారులు, చెప్పులు కుట్టేవారు, తాపీ, బుట్టలు అల్లేవారు. క్షురకులు, బొమ్మల తయారీదారులు, చేపల వల తయారీ, బట్టలు కుట్టేవారు, బట్టలు ఉతికేవారికి అవసరమైన శిక్షణ ఇవ్వటంతో పాటు రూ.3 లక్షల వరకు రుణసాయం అందించే అవకాశం ఉందన్నారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని చేతివృత్తుల వారు వ్యాపార రంగంలో రాణించాలని సూచించారు. ఇందుకుగానూ అవసరమైన సహాయ సహకారం ఎంఎస్ఎంఈ అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సిబ్బంది, పలు ప్రాంతాల నుంచి వచ్చిన చేతి వృత్తుల వారు పాల్గొన్నారు.

కాలువ ఇలా... నీరు పారేదెలా?





మునేరు తువ్వ కాలువలో పెరిగిన కంప, పిచ్చిచెట్లు

- తువ్వ కాలువలో భారీగా పెరిగిన కంపచెట్లు
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

పెనుగంచిప్రోలు: మునేరు తువ్వ కాలువ మొత్తం కంపచెట్లు, పిచ్చి మొక్కలు నిండిపోవడంపై ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. పలుచోట్ల తూములు బలహీనంగా ఉండగా, కల్వర్టులు ఏర్పాటు చేయటంతో కాలువ కూడా కుంచించుకుపోయింది. కొద్దిరోజుల్లో కాలువకు మునేరు నుంచి సాగునీరు వదలనున్న నేపథ్యంలో కాలువ అంతా కంపచెట్లు ఉన్నందున సాగునీరు ముందుకు కదలే పరిస్థితి ఉండదు. దీంతో ఆయకట్టు చివరిభూములకు నీరు అందదని రైతులు చెబుతున్నారు.

రైతులకు తప్పేలాలేని అవస్థలు..

మునేరు తువ్వ కాలువకు సంబంధించి వత్సవాయి మండలం అళ్లూరుపాడునుంచి పెనుగంచిప్రోలు మండలం గుమ్మడిదూర్రు గ్రామం వరకు కాలువ ఆయకట్టున సుమారు 1400ఎకరాల్లో మాగాణి సాగవుతోంది. కాలువలో నీరు పెనుగంచిప్రోలు భూములకు మాత్రమే వస్తుండటంతో చివరి భూములైన అనిగండ్లపాడు, గుమ్మడిదూర్రు రైతులు సాగునీరు అందక రైతులుఅనేక అవస్థలు పడుతున్నారు. దీంతో రైతులు బోర్లపైనే ఆధారపడి పంటలను సాగుచేయాల్సి వస్తోంది. కాలువలో పలుచోట్ల ఉపాధిహామీ పథకంలో భాగంగా అక్కడక్కడ కంపచెట్లు తొలగించడంతోపాటు పూడిక తీస్తున్నా కాలువంతా అధ్వాన్నంగానే ఉంది.



శిథిలావస్థకు చేరిన కాలువ రాపు

గతేడాది గండ్లు పూడ్చివేత..

గతేఏడాది వరదలకు పెనుగంచిప్రోలు నుంచి నందిగామ మండలం వరకు తువ్వ కాలువలకు 38 చోట్ల గండ్లు పడటంతో అప్పటి ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి యుద్ధ ప్రాతిపదికన పూడ్చించారు. కట్టలను అభివృద్ధి చేశారు. ప్రస్తుతం అళ్లూరుపాడు నుంచి అనిగండ్లపాడు వరకు కాలువలో చెట్లు, కంప నిండి ఉండటంతో సాగునీరు ముందుకు కదలే పరిస్థితి లేదని, తూములు కూడా అధ్వాన్నంగా ఉన్నాయని రైతులు వాపోతున్నారు. ఇకనైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి తువ్వకాలువలో కంపచెట్లు, ముళ్లపొదలను తొలగించి సాగునీటి పారుదలకు ఇబ్బంది లేకుండా చూడాలని రైతులు కోరారు. ఈ విషయంపై ఇరిగేషన్ అధికారులను వివరణ కోరగా ఖరీఫ్‌సాగుకు సంబంధించి సాగునీరు విడుదల చేసే సమయానికి కాలువలో కంప, పిచ్చి చెట్లు లేకుండా చేస్తామని తెలిపారు. రైతులకు ఇబ్బంది లేకుండా నీరు అందిస్తామని వివరించారు.

కంప, పిచ్చిచెట్లు తొలగించాలి..



తువ్వ కాలువలో ఉన్న కంప, పిచ్చి చెట్ల కారణంగా సాగునీరు ముందుకు కదిలే పరిస్థితి లేదు. రాపులు కూడా అధ్వాన్నంగా ఉన్నాయి. దీంతో చివరి భూములకు నీరు అందదు. కొద్దిరోజుల్లో ఖరీఫ్ సీజన్ కోసం కొద్దిరోజుల్లో నీరు విడుదలయ్యే అవకాశం ఉన్నందున కాలువను బాగుచేయించాలి.

– కోలా రామారావు, రైతు, అనిగండ్లపాడు

మరమ్మతులు చేపట్టాలి...



గతేడాది వరదలకు పడిన గండ్లు పూడ్చారు. ప్రస్తుతం కాలువలో రాపుల పరిస్థితి బాగోలేదు. కాలువలో పిచ్చిమొక్కలు తొలగించి, మరమ్మతులు చేస్తేనే చివరి భూముల వరకు సాగు నీరు అందుతుంది. అధికారులు ఆదిశగా చర్యలు తీసుకోవాలి.

– తోక కృష్ణ, గుమ్మడిదుర్రు, రైతు

ప్రజల ఆకాంక్ష మేరకు అభివృద్ధి చేస్తా : సౌమ్య

నందిగామ(కంచికచర్ల) : ప్రజల సంకల్పంతోనే టీడీపీ కూటమి విజయం సాధించిందని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. నందిగామలోని బాబూ జగ్జీవన్‌రాం కళ్యాణ మండపంలో శుక్రవారం బీజేపీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ ప్రజల ఆశలకు, ఆకాంక్షలకు అనుగుణంగా పాలనసాగిస్తామన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానన్నారు. ప్రజలు తమ పార్టీకి కట్టబెట్టింది అధికారం కాదని..బాధ్యత అని పేర్కొన్నారు. నందిగామ నియోజకవర్గంలో ఏ సమస్య ఉన్నా తనదృష్టికి తీసుకువస్తే అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే సౌమ్యను బీజేపీ నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించారు.



మాట్లాడుతున్న నందిగామ ఎమ్మెల్యే సౌమ్య

సమావేశంలో బీజేపీ నాయకులు సీతారామయ్య, సున్నారెడ్డి దయాకర్‌రెడ్డి, అట్లూరి శ్రీరామ్, మాదాల రమేష్, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, కొత్త సాంబశివరావు, పోరంగి నరసింహారావు, జి.శివకృష్ణారెడ్డి, శర్మ, రావూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'అల్ట్రాటెక్' కోల్‌మిల్లులో పొగలు

పరిశీలించిన తహసీల్దార్

బూదవాడ(జగ్గయ్యపేట): మండలంలోని బూదవాడ అల్ట్రాటెక్ సిమెంట్స్ కర్మాగారంలోని కోల్ మిల్లులో శనివారం పొగలు వ్యాపించాయి. ఈనెల ఏడున కర్మాగారంలో పేలుడు సంభవించి ప్రమాదం చోటుచేసుకున్న నేపథ్యంలో వారంరోజులుగా ఫ్యాక్టరీలో ఉత్పత్తిని నిలిపివేశారు. ఈ క్రమంలో శనివారం ఉదయం కార్మికులు ఫ్యాక్టరీ ఆవరణను శుభ్రం చేస్తుండగా పొగలు వ్యాపించాయి. దీంతో కర్మాగారంలో మళ్లీ పేలుళ్లు చోటుచేసుకున్నాయంటూ సోషల్ మీడియాలో ప్రచారం సాగడంతో జిల్లా అధికారులు స్పందించారు.దీంతో జగ్గయ్యపేట తహసీల్దార్ శేషగిరిరావు వెంటనే అల్ట్రాటెక్ సిమెంట్స్‌లోని కోల్‌మిల్లును పరిశీలించారు. కంపెనీ ఇంజినీర్లతో మాట్లాడి పొగ రావాడానికి గల కారణాలను ఆరాతీశారు. ఫ్యాక్టరీలో ఉత్పత్తి నిలిచిపోవటంతో పలు యూనిట్‌ల్లో ముడి పదార్థాలను బయటకు తొలగించకపోతే ఇబ్బందులు తలెత్తుయనే ఉద్దేశంతో కోల్ యూనిట్‌ను శుభ్రం చేస్తుండగా పైపుల్లో ఉన్న బొగ్గు పౌడర్ ఒక్కసారిగా పొగ రూపంలో బయటకు వచ్చిందని ఇంజినీర్లు, తహశీల్దార్‌కు వివరించారు. ఎటువంటి ప్రమాదం చోటుచేసుకోలేదని వివరణ ఇచ్చారు. అదేవిధంగా ఫ్యాక్టరీ అధికారులు పొగ కారణంగా దుమ్ము రాకుండా ఇంజిన్లతో నీళ్లు కొట్టించారు. తహశీల్దార్ వెంట డీటీ నాగరాజు, ఆర్ఐ ఆనంద్, ప్లాంట్ హెడ్ సతీష్, సిబ్బంది ఉన్నారు. ఫ్యాక్టరీలో ఎటువంటి ప్రమాదం చోటుచేసుకోలేదని, కేవలం బొగ్గు పౌడర్ కారణంగా పొగ వచ్చిందని తెలియడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.



ఫ్యాక్టరీ అధికారులతో మాట్లాడుతున్న తహశీల్దార్ శేషగిరిరావు



దుమ్ము రాకుండా నీరుపెడుతున్న కార్మికులు

బస్సుల తరలింపు తగదంటూ ధర్నా

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట ఆర్టీసీ డిపోకు చెందిన బస్సులను విజయవాడ డిపోకు తరలించాలని మేనేజ్‌మెంట్ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేశారు. ఈసందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ జగ్గయ్యపేట-విజయవాడ రూట్‌లో నడుస్తూ డిపోకు ప్రధాన ఆదాయవనరుగా ఉన్న 25అద్దెబస్సుల్లో 10బస్సులను అద్దె బస్సుల యజమానుల సౌలభ్యం కోసం విజయవాడ డిపోకు తరలిస్తామనడం తగదన్నారు. ఈ చర్య కారణంగా జగ్గయ్యపేట డిపోకు రోజుకు సుమారు రూ.3లక్షలు ఆదాయం తగ్గిపోవడంతోపాటు సుమారు 30మందికి పైగా ఉద్యోగులు బదిలీ అయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. భవిష్యత్‌లో పేట డిపో మినీ డిపోగా మారిపోయి నష్టాల పేరుతో మూసివేస్తారని అనుమానం వ్యక్తంచేశారు. గతంలో కూడా కోదాడ-విజయవాడ రూట్, నందిగామ సెక్టార్‌లో నడిచే 30బస్సులను జగ్గయ్యపేట డిపో నుంచి వేరే డిపోలకు పంపించారన్నారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో 26 బస్సులు ఒకేసారి రద్దు చేశారని గుర్తుచేశారు. ఇలా జగ్గయ్యపేట బస్సులను ఇతర డిపోలకు తరలిస్తుండటంతో జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల ప్రజలు తీవ్రఇబ్బందులుపడ్డారన్నారు. ఆదాయం రావడంలేదనే నెపంతో రాత్రివేళ ఉన్న శ్రీశైలం బస్సు సర్వీసును కూడా రద్దు చేశారన్నారు. జగ్గయ్యపేట డిపోను నష్టపరిచే చర్యలను ఇకనైనా ఆర్టీసీ యాజమాన్యం మానుకోవాలని కోరారు. అనంతరం యూనియన్ నాయకులు జగ్గయ్యపేట డిపో మేనేజర్ రఘురాం, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. బస్సుల తరలింపును నిలుపుదల చేయాలని కోరారు. ధర్నాలో ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి ఎ.ఆనంద్, డ్రైవర్స్ అసోసియేషన్ కార్యదర్శి షేక్ జిలాని, సంయుక్త కార్యదర్శి కె.వసంతకుమార్, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.



జగ్గయ్యపేట ఆర్టీసీ డిపో గేటు వద్ద ధర్నా చేస్తున్న ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, సభ్యులు

కంచికచర్లలో 8,2వర్షపాతం

కంచికచర్ల: రెండురోజులుగా కంచికచర్ల మండలంలో కురుస్తున్న వర్షానికి పంటలు కళకళలాడుతున్నాయి. ఈ రెండురోజుల్లో కంచికచర్లలో 8.2 మి.మీ వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు.లోతట్టు పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉన్నట్లయితే రైతులు వెంటనే ఆ నీటిని బయటకు పంపించాలని మండల వ్యవసాయశాఖాధికారులు సూచిస్తున్నారు.

పోలేరమ్మకు అన్నాభిషేకం

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక ఊర్మిళా సుబ్బారావు గ్రామ దేవత పోలేరమ్మ తిరునాళ్ల ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు శనివారం అమ్మవారికి అన్నాభిషేకం చేశారు. వేకువజామున 5 గంటల నుంచి 7 గంటల వరకు కుంభాభిషేకం, ఉదయం 8 గంటల నుంచి 9 గంటల మధ్య అన్నాభిషేకం, అనంతరం పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. తరువాత కుంకుమ పూజ కార్యక్రమం జరిగింది. సాయంత్రం 7 గంటల నుంచి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం పాలకవర్గం అధ్యక్షుడు సూరసాని రామిరెడ్డి మాట్లాడుతూ పోలేరమ్మ తల్లిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వస్తున్నారని తెలిపారు. చివరి రోజు ఆదివారం ఉదయం 7 గంటలలోపు ముత్తయిదువులు, కన్యలు కలిసి కృష్ణానదికి వెళ్లి తీసుకువచ్చే జలంతో పోలేరమ్మ అమ్మవారికి కుంభాభిషేకం, అనంతరం పంచామృతాలతో అభిషేకరం, అమ్మవారికి అలంకరణ, మధ్యాహ్నం 12 గంటలకు పొంగలి నివేదన జరుగుతాయని వివరించారు. సాయంత్రం 6 గంటల నుంచి పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు, అనంతరం తీర్థప్రసాదాల వితరణ ఉంటుందని తెలిపారు.

నేడు ఉచిత నేత్ర, దంత మెగా వైద్యశిబిరం

భవానీపురం(విజయవాడపశ్చిమ): వాసవి క్లబ్ ఉత్సవ్ విజయవాడ కపుల్స్ ఆధ్వర్యంలో ఆదివారం భవానీపురం శివాలయం సెంటర్‌లోని బీజేపీ కార్యాలయం ప్రాంగణంలో ఉచిత నేత్ర, దంత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జీవీవీ బాల సుబ్రహ్మణ్యం, జీఎమ్‌వీ విశ్వేశ్వరరావు, కోశాధికారి దివ్వెల మానసా దేవి ఒక ప్రకటనలో తెలిపారు. చేబ్రోలు వెంకట సుబ్బారావు నిర్వహణలో ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ వైద్య శిబిరంలో శంకర నేత్ర చికిత్సాలయ వైద్యురాలు నాదెళ్ల స్వాతి నేతృత్వంలో ఉచిత కంటి పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. అదే విధంగా ఆపిల్ ఇంటర్నేషనల్ డెంటల్ వైద్యులు ఎ.పార్థసారథి, ఎ.సుమలత ఉచిత దంత పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఆయా పరీక్షల అనంతరం మందులు కూడా ఉచితంగా అందచేస్తారని పేర్కొన్నారు. భవానీపురం, విద్యాధరపురం ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అలరించిన కూచిపూడి నృత్యాలు



భవానీపురం (విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ప్రాంగణంలోని కళావేదికపై కళాకారిణులు తమ కూచిపూడి నృత్యాలతో భక్తులను అలరించారు. ప్రతి రోజు నిర్వహించే ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం విశాఖపట్నానికి చెందిన నాట్య ఝురి సంగీత నృత్యాలయ ఆధ్వర్యంలో నాట్యాచారిణి సాహితి రవళి నేతృత్వంలో వినాయక కౌతం, ఎందరో మహానుభావులు..కొందరికే వందనములు, బ్రహ్మాంజలి..తాండవ నృత్యకేళి , అఖిలాండేశ్వరీ..చాముండేశ్వరి, శివాష్టకం, శివతాండవం, శివ స్తుతి, అదివో అల్లదిఓ శ్రీహరివాసమూ, జగదానందకారక..జయ జానకి ప్రాణ నాయక, రాజరాజేశ్వరి అష్టకం అంశాలకు పలువురు నర్తకీమణులు నర్తించారు. ఆయా అంశాలకు తగ్గట్లు చక్కని హావభావాలు, ఆహార్యం, అభినయంతో ప్రదర్శించిన సంప్రదాయ కూచిపూడి నృత్యాలు భక్తులను తన్మయులను చేశాయి.

జీపీఎస్ జీవోను రద్దు చేయాలి

- జీవో ప్రతులను దగ్ధం చేసిన యూటీఎఫ్ నాయకులు
- ఓపీఎస్ పునరుద్ధరణకు డిమాండ్



జీవో ప్రతులను దగ్ధం చేస్తున్న పేట యూటీఎఫ్ నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్రప్రభుత్వం ఈనెల 12వ తేదీన పాతతేదీతో జీపీఎస్‌ను అమలుచేస్తూ విడుదల చేసిన జీవోనంబర్ 54ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని యూటీఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జగ్గయ్యపేట మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం స్థానిక టీచర్స్ కోపరేటివ్ సొసైటీ భవన్ వద్ద యూటీఎఫ్ రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు జీవోనంబరు 54 ప్రతులను దగ్ధం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం పాతతేదీతో జీపీఎస్‌ను అమలు చేస్తూ విడుదల చేయడం తగదన్నారు. జీవో నంబర్ 54ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎం.కృష్ణయ్య, జి.పల్లవి, జి.ముక్తేశ్వరరావు, కె.హనుమంతరావు, సీహెచ్ఎస్ఎన్ మూర్తి, ఎ.నరసింహారావు, ఎండీ.మునీర్ బాషా, ఎం.పరమేశ్వరరావు, ఎం.దేవదానం, కె.విజయలక్ష్మి, ఎస్.గంగాధరరావు, వీవీ.సుబ్బారావు, కె.సాయిశ్రీనివాసరావు, టి.జయసుధ, వి.దుర్గాప్రసాద్, ఎస్వీ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలు.. జర జాగ్రత్త

- యమపాశాలుగా విద్యుత్ తీగలు
- అప్రమత్తతే రక్షణ

వత్సవాయి : వర్షాకాలంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా విద్యుత్ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి. లేనిపక్షంలో ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితులు ఎదురవుతాయి. ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా విద్యుత్ తీగలే మృత్యుతీగలుగా మారతాయి. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు అస్తవ్యస్తంగా ఉన్న నేపథ్యంలో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఉంది. ఇక పొలాల్లో ఒంగిన కరెంట్ స్తంభాలు, కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంట్ సరఫరాతో తెగిపడిన విద్యుత్ తీగలను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండాల్సి ఉంది.

నిర్లక్ష్యంగా వ్యవహరించరాదు..

రైతులు విద్యుత్ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని వ్యవసాయ, విద్యుత్‌శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. విద్యుత్ మరమ్మతులను మెకానిక్‌లచే చేయించుకోవాలని, స్వంతంగా పూనుకోరాదని వారు సూచిస్తున్నారు. వర్షాకాలంలో పిడుగులు కూడా ఎక్కువగా పడే అవకాశం ఉన్నందున ప్రమాదాల బారినపడకుండా ఎన్డీఆర్ఎఫ్ అధికారుల సూచనలను తప్పకుండా పాటించాల్సి ఉంది.

సూచనలు పాటించాలి..

- రైతులు తప్పనిసరిగా పొలాల్లో నాణ్యమైన న్యూట్రల్ ఫేజ్‌ను ఏర్పాటు చేసుకోవాలి
- వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ మరమ్మతుల జోలికి వెళ్లరాదు.



వత్సవాయిలో రక్షణ ఏర్పాట్లు లేకుండా ఉన్న టాన్స్‌ఫార్మర్ ఫ్యూజులు

- గ్లౌజులు లేకుండా విద్యుత్ మరమ్మతుల జోలికి పోకుండా ఉంటే మంచిది, స్టార్టర్లు, మోటార్లు మరమ్మతులకు గురైతే వెంటనే మెకానిక్‌ను సంప్రదించాలి.
- విద్యుత్ మరమ్మతుల సమయంలో వీలున్నంత వరకు కాళ్లకు రబ్బరు బూట్లు, చేతికి గ్లౌజులు వేసుకుంటే ఉత్తమం.
- విద్యుత్ తీగలు వేలాడుతుంటే వెంటనే విద్యుత్‌శాఖ సిబ్బందికి తెలియజేసి, వారిచే సరిచేయించాలి.
- వర్షాలు పడుతున్న సమయంలో నిటారుగా ఉన్న చెట్లు, భారీ వృక్షాల వద్దకు వెళ్లరాదు. కరెంట్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలి.

వర్షానికి ఒరిగిన విద్యుత్ స్తంభం

కంచికచర్ల: నాలుగురోజులుగా కురుస్తున్న వర్షానికి విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని గండేపల్లి శివారులో 11కేవీ విద్యుత్ స్తంభం నేలకొరిగింది. గమనించిన రైతులు విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించడంతో మరమ్మతులు చేసేందుకు విద్యుత్‌శాఖ లైన్‌మెన్లు కామా నరసింహారావు, వై.రామారావు చర్యలు చేపట్టారు. విద్యుత్ స్తంభాలు ఒరిగిపోవడం, విద్యుత్ తీగలు తెగిపోయినట్లు పొలాల్లో గుర్తించినట్లయితే ప్రజలు వెంటనే తమకు తెలియజేస్తే మరమ్మతులు చేపడతామని ఆశాఖ అధికారులు తెలిపారు.



గండేపల్లి పొలాల్లో నేలకొరిగిన విద్యుత్ స్తంభాన్ని పరిశీలిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది

27 నుంచి ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఈ నెల 27వ తేదీ నుంచి రెండు రోజుల పాటు ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా ప్లీనరీ సమావేశాలను మైలవరంలో నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. రాఘవయ్య పార్కు సమీపంలోని బాలోత్సవ భవన్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత ప్లీనరీ సమావేశాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశాలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం విద్యార్థుల సమస్యలపై చర్చించి భవిష్యత్ ప్రణాళిక ప్రకటిస్తామన్నారు. సిలబస్ మార్పుల వలన 9, 10 తరగతుల్లో తలెత్తిన సమస్యలను పరిష్కరించాలని, సంక్షేమ హాస్టళ్లకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న నాడు-నేడు పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి టి.కుమారస్వామి, నాయకులు అవినాష్, షణ్ముక్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యానిమేషన్ రంగంలో ఉపాధి అవకాశాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): యానిమేషన్ రంగంలో మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని ప్రముఖ చిత్రకారుడు ఎన్ శ్రీధర్ అన్నారు. ఎంజీ రోడ్డులోని నలంద డిగ్రీ కళాశాల విజువల్ కమ్యునికేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం ఎక్స్‌ప్రెసివ్ 2డి యానిమేషన్ వర్క్‌షాపు నిర్వహించారు. ఈ వర్క్‌షాపులో చిత్రకారుడు శ్రీధర్ పాల్గొని విద్యార్థులకు 2డి యానిమేషన్‌కి సంబంధించిన మెలకువలు, క్యారెక్టర్ ఆర్ట్, ఎనాటమీ, ఎక్స్‌పెషన్స్ వంటివి నేర్పించారు. విద్యార్థులు ఉత్సాహంగా రేఖా చిత్రాలు గీసేందుకు ప్రయతిన్నంచారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, విజువల్ కమ్యునికేషన్ విభాగాధిపతి బి.శ్రీనివాసరావు, ఫిరోజ్‌ఖాన్, భార్గవి పాల్గొన్నారు.



యానిమేషన్‌లో అవకాశాలను విద్యార్థులకు వివరిస్తున్న చిత్రకారుడు శ్రీధర్